క్లుప్తంగా

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల తాకిడి

శనివారం ఒక్కరోజే స్వామి వారికి రూ.3.84 లక్షల ఆదాయం

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కార్తిక మాసం తొలిరోజు, స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.3,84,941 ఆదాయం సమకూరినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా తొమ్మిది వేల మంది భక్తులకు ప్రసాద వితరణ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, ఆలయ సిబ్బంది సేవలందించారు.

పంచారామ క్షేత్రంలో ఉప లోకాయుక్త



రజనీ దంపతులకు స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేసిన ఈఓ నీలకంఠం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజనీ దంపతులు దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం ఆలయానికి వచ్చిన దంపతులకు ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్వామి వారిని, అమ్మ వార్లను దర్శించుకున్న వారికి ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సనిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ వారికి ప్రసాదం, స్వామి వారి ఫొటోను అందజేశారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

పెద్దాపురం: ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీల మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అన్నా రు. స్థానిక వరహాలయ్యపేట యాలసపు సూర్యారావు భవనంలో శనివారం తాడిశెట్టి గంగాధరరావు అధ్యక్షతన ప్రైవేట్ ఎలక్ట్రికల్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. చింతల మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ రంగానికి చెందిన అన్ని విభాగాల కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం కార్మికులకు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. కందరెళ్ల దుర్గాప్రసాద్, పి.జోగుబాబు, సర్వసుద్ది శ్రీను, కాకి దుర్గ, రొంగల రమేష్, షేక్ ఇబ్రహీం, గణేష్, ఉమా మహేష్, గోవిందరావు పాల్గొన్నారు.

పాఠశాల నుంచి బకాయిలు ఇప్పించండి

ఎమ్మెల్యేకు ఫిర్యాదు అందజేసిన ఎంపీటీసీ

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవం త్రివర్ణ పబ్లిక్ స్కూల్ నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు శనివారం వినతి పత్రం అందజేశారు. స్థానిక సుగర్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు సూరిబాబు పాఠశాల నుంచి రావలసిన బకాయిలను వివరించారు. ఇటీవల జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాఠశాల నుంచి రావలసిన బకాయిలపై ప్రశ్నించగా తనకు దరఖాస్తు ఇస్తే విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో వినతిపత్రం అందజేసినట్టు సూరిబాబు విలేకర్లకు తెలిపారు. గ్రామంలోని వ్యవసాయ భూమిలో పంచాయతీ అనుమతి లేకుండా పాఠశాల భవనం నిర్మించారన్నారు. పంచాయతీ ఎన్ఓసీ లేకుండా రెన్యూవల్ చేయమని జిల్లా విద్యాశాఖాధికారులు చెప్పి రెన్యూవల్ చేశారని ఆయన ఆరోపించారు. భవనానికి హెల్త్, అగ్నిమాపక, సర్వశిక్షాభియన్ ఈఈ నకిలీ డోరు నంబరుతో ఎన్ఓసీ ఇచ్చారని సూరిబాబు తెలిపారు. పంచాయతీకి డెవలప్‌మెంట్ చార్జీలుగా రూ.20 లక్షలు, పన్నుగా రూ.14 లక్షలు రావలసి ఉందని వివరించారు. పాఠశాల నుంచి బకాయిలు వస్తే పంచాయతీలో అభివృద్ధి పనులకు ఉపయోగపడుతుందన్నారు.

గోతుల పూడ్చివేత

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో మాండవ్య నారాయణస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో కాలిబాట వంతెన వద్ద గోతులను పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాకినాడ నుంచి వేట్లపాలెం వెళు కెనాల్ రోడ్డు మాండవ్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గోతులు పడడంతో తరచూ ట్రాక్టర్లు బోల్తా పడుతున్నాయి. శనివారం నుంచి కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఆలయాలకు భక్తులు పెరుగనుండడంతో ఎమ్మెల్యే చిన్నరాజప్ప ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు గోతులను పూడ్చివేసే కార్యక్రమం చేపట్టారు.

కుంటుపడుతున్న పారిశుధ్యం

- పెరగని కార్మికుల సంఖ్య
- విరుగుతున్న ట్రాక్టర్లు
- అరకొర సౌకర్యాలతో తప్పని ఇబ్బందులు
- కూటమి నేతల పెత్తనంతో పట్టించుకోని అధికారులు



పెద్దాపురం మెయిన్ రోడ్డులో చెత్త సేకరిస్తుండగా విరిగిన ట్రాక్టర్ చక్రాలు (ఫైల్)

పెద్దాపురం: పట్టణ విస్తీర్ణం పెరుగుతోంది. పట్టణ శివారులు, ఊరు మధ్యలో అపార్ట్‌మెంట్లు వెలస్తున్నాయి. జనాభా సంఖ్య వృద్ధి చెందుతోంది. దీనికి తగ్గ చెత్త కూడా పెరుగుతోంది. కానీ పారిశుధ్య కార్మికుల సంఖ్య మాత్రం పెరగడంలేదు. దీంతో పని చేసేందుకు కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణ, గ్రామాల్లో చెత్తపై విధించే పన్నులు పెరుగుతున్నాయి. దీనివల్ల మున్సిపాలిటీకి ఆదాయం బాగానే వస్తోంది. కానీ అధికారులు మాత్రం కార్మికుల అవసరాలను పట్టించుకోవడంలేదు. దాదాపు 15 ఏళ్ల కిందట మున్సిపల్ కార్మికులు 225 నుంచి 150 మంది వరకూ ఉంటే ప్రస్తుతం వంద మంది సిబ్బంది మాత్రమే పారిశుధ్య పనులు చేపడుతున్నారు.

పెద్దాపురం పట్టణ విస్తీర్ణంలో మాత్రం ఎన్టీఆర్ కాలనీ, టిడ్కో కాలనీ, భాస్కర కాలనీ, పద్మనాభ కాలనీ, సుధా కాలనీ శివారుల్లో కాలనీలు అనేకంగా పెరిగాయి. వీటితో పాటు అపార్ట్‌మెంట్ల సంఖ్య పెరిగింది. దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం జనాభా ప్రతిపాదికన చూస్తే సుమారు 250 నుంచి 300 మంది వరకు పారిశుధ్య కార్మికులు ఉండాలి.

ఎన్ని పనులు చేయాలో..

చెత్త ఎత్తాలి.. ట్రాక్టర్ లోడ్ వేయాలి.. కాలువలు శుభ్రం చేయాలి.. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి.. ఇన్ని పనులు ఉన్నా కార్మికులతో సాధ్య పడడం లేదు. కానీ కార్మికులే ఈ పనులన్నీ చేయాల్సిందేనంటూ ఒత్తిడి పెరుగుతోంది. చెత్త ఎత్తితే ట్రాక్టర్ వెళ్లడం కుదరడం లేదని, కాలువలు శుభ్రం చేస్తే చెత్త సేకరణ సాధ్య పడడం లేదని, ఎన్ని పనులు సమయానికి శ్రమకు మంచి చేయాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత ట్రాక్టర్లతో తప్పని ఇక్కట్లు

కార్మికులు పని చేయాలంటే కనీస సౌకర్యాలుండాలి. కూటమి ప్రభుత్వం చివరకు చీపుర్లు కూడా కార్మికులే తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. చెత్త ఎత్తడానికి అవసరమైన అత్యంత ప్రధానమైన ట్రాక్టర్లు కాలం చెల్లడంతో కార్మికుల పాట్లు వర్ణనాతీతం. కొత్త వాటిని తీసుకోకపోవడంతో వాటిపైనే కార్మికులతో పని చేయిస్తున్నారు. దీంతో రోడ్ల మధ్య ట్రాక్టర్ చక్రాలు విరిగిపోయినా వాటితోనే కార్మికులు కాలం వెల్లదీస్తున్నారు. ట్రాక్టర్ మరామ్మత్తు గురైనా సరే వారికి అప్పగించిన పని పూర్తి చేయాల్సిందే. ఇరిగిపోయిన ట్రాక్టర్లు బాగు చేయడానికి వాటికి అవసమైన పరికరాలు కొనడానికి నిధులు కేటాయించాలని చర్చలు అనేక సార్లు జరిగినా అవి కేవలం తీర్మానాలకే పరిమితమయ్యాయి. దీంతో పారిశుధ్య కార్మికుల కష్టాలు తప్పడం లేదు. పట్టణ పరిశుభ్రత పూర్తి కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాల కల్పించాలి పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.

కూటమి వచ్చాకే ఇబ్బందులు



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో అన్ని మున్సిపాల్టిల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలకు ప్రజల ఆరోగ్యంపై దృష్టి లేదు. ప్రజలకు అత్యంత అవసరమైన ప్రజారోగ్య వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకుంటోంది. పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ములు, పెద్దాపురం మున్సిపాలిటీల్లో ప్రధాన అవసరమైన పారిశుధ్య పనులకు ఉపయోగించాలి. పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి.

–నీలపాల సూరిబాబు, సీపీఎం నాయకులు, పెద్దాపురం

ప్రభుత్వం దృష్టిలో ఉంచాం



పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపడతున్నాం. పూర్తి స్థాయిలో సిబ్బంది నియమాకం ప్రభుత్వ నిర్ణయం. ప్రభుత్వం దృష్టిలో ఉంచాం. పారిశుధ్య సిబ్బంది పెంపుదలపై స్పష్టత రాగానే జనాభాకనుగుణంగా పూర్తి స్థాయి పారిశుధ్య సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతాం.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

వలంటీర్ల నిరాహార దీక్ష



సామర్లకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలో వలంటీర్లు

సామర్లకోట: వలంటీర్లు నిరాహార దీక్షకు దిగారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తమను విధుల్లో కొనసాగించాలని, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వలంటీర్లు శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసి, వలంటీర్లకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఇప్పటి వరకు వేచి చూచి తప్పనిసరి పరిస్థితిలో తమ నిరసన తెలియజేయడానికి నిరాహార దీక్ష చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. వీరికి సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కర రాజ్ కుమార్, మండల కన్వీనర్ సురేష్ మద్దతు తెలియజేశారు. నిరహార దీక్షలో వలంటీరు నిమ్మన నాగలక్ష్మి, కేవీ లక్ష్మీ, కె.క్రాంతికుమారి, కె.దుర్గాదేవి, పి.ప్రవలిక, కె.గనిలక్ష్మి, ఎ.గంగాధర్, ఈ వరుణ్‌కుమార్ పాల్గొన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి గౌరవ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ నాయకుడులు రాజ్‌కుమార్, సురేష్ డిమాండ్ చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ



కంప్యూటర్ విద్య నేర్చుకుంటున్న విద్యార్థులను పరిశీలించిన ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు చిన్నతనం నుంచి సాంకేతిక పరిజ్ఞానం పెరగాలనే లక్ష్యంతో దాతలు ముందుకు వచ్చి కంప్యూటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. ఉండూరు శివారు ప్రకాశరావుపేటలోని ఎలిమెంటరీ పాఠశాలకు దాతలు దవులూరి దొరబాబు, చక్కని ప్రభాకరరావు, వెన్నపు గంగాకృష్ణ, ఓఎన్‌జీసీ, కాకినాడ 13 కంప్యూటర్లు, డస్కులు అందజేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు వాటిని ఎంఈఓ-2 శనివారం పరిశీలించారు. చిన్నతనం నుంచి కంప్యూటర్‌పై అవగాహన పెరిగితే సాంకేతికంగా ముందుకు దూసుకు వెళ్లడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కంప్యూటర్లు ఏర్పాటుకు దాతలను ఒప్పించడానికి కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్‌ను అభినందించారు.

రీ సర్వేతో రైతుల సమస్యలకు పరిష్కారం



పనసపాడు సదస్సులో రైతుల అనుమానాలను నివృత్తి చేస్తున్న తహసీల్దార్

సామర్లకోట: రీ సర్వేతో రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలో శనివారం పనసపాడు పంచాయతీలో నిర్వహించిన రీ సర్వే అవగాహన సదస్సు కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కోసం ఈ రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. రైతుల దస్తావేజులోను, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. భూములకు సంబంధించిన యధార్ధ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాలని తెలిపారు. ప్రతి ఒక్క రైతు ఈ రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ సభలో 35 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు టి.సాయిరాం, ఎ.సంజీవ్, డి.దినేష్, బి.రామకృష్ణ, రమేష్, వీఆర్వోలు ఎండీ ఖాదర్‌వల్లీ, వల్లూరి దుర్గారావు, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్ల నమోదుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పిఠాపురం: పట్టభద్రుల ఓట్లు నమోదుపై మండల, పట్టణ స్థాయి అధికారులు అవగాహన కల్పించి అత్యధికంగా ఓటర్లను చేర్పించాలని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కర్రే స్వప్న సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పట్టభద్రుల ఓట్లు నమోదుపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ రవికుమార్, ఎంఈఓ-2 శివప్రసాద్ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ఆకాశ దీపం పూజలు



ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: కార్తిక మాసంలో ప్రతి రోజు సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం ఆకాశం దీపంకు పూజలు చేసి ధ్వజస్తంభంపై భాగంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, పండితులు చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజలు చేశారు. భక్తులు ఆకాశ దీపాన్ని తిలకించారు.


ఆకాశదీపం.. భక్తికి ప్రతిరూపం

పిఠాపురం: కార్తిక మాసంలో ఆకాశ దీపానికి అంత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ప్రతి ఆలయంలోనూ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపాన్ని వెలిగించి నింగిలో ఉండే విధంగా వేలాడదీస్తారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో శనివారం భక్తులు ఆకాశ దీపం వెలిగించారు. నెలరోజుల పాటు ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో భక్తులు వెలిగించిన దీపాలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఎంతగానో ఆకట్టుకుంది. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారి కి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేసుకుంటారు. ఇలా లక్షపత్రి పూజ లు చేసుకునే భక్తులు దేవస్థానానికి రూ.2,500 చెల్లించాలి.

దుర్గాదేవికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం



108 రకాల పిండి వంటలతో మహా నైవేద్యం

పిఠాపురం: గొల్లప్రోలు కరణంగారి తోటలో వేంచేసిన దుర్గాదేవి అమ్మవారికి శనివారం కార్తికమాసం ప్రారంభం సందర్భంగా 108 రకాల పిండి వంటలతో మహా నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాజుల అలంకారంలో దుర్గాదేవి →



రేషన్ వాహనం నిలిపివేతతో ఇక్కట్లు



రేషన్ సరకుల కోసం వేచి ఉన్న వృద్ధులు

సామర్లకోట: స్థానిక 13వ వార్డుకు చెందిన రేషన్ వాహనం అధికారులు నిలిపి వేయడంతో వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రేషన్ వాహనాలు నిలిపివేత ప్రయోగంలో భాగంగా తమ వార్డుకు చెందిన వాహనాన్ని నిలిపి వేశారని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. దాంతో బలుసులపేటకు చెందిన ప్రజలు సుమారు అర కిలో మీటరు దూరంలో అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఉన్న రేషన్ షాపు నుంచి సరకులు తీసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత వార్డులోనే ఇటువంటి ప్రయోగాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. పేద ప్రజలు, వృద్ధులు, దివ్యాంగులు ఎక్కువగా ఉండడం వల్ల రాత్రి సమయంలో ఇచ్చే రేషన్ షాపు వద్దకు వెళ్లి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రేషన్ షాపు వద్ద వినియోగదారులు బారులు తీరారు. ఇంటింటికి వచ్చి సరకులు అందజేసే రేషన్ వాహనాలను నిలిపి వేస్తే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హరిబాబు హెచ్చరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి రామాలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్లు రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ తమ వెంట తీసుకురావాలని సూచించారు.

శివపూజకు శ్రీకారం.. శుభకరం



పాదగయ క్షేత్రంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

- పవిత్ర కార్తిక మాసోత్సవాలు ప్రారంభం
- పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

పిఠాపురం: పవిత్రమైన కార్తికమాసం శనివారం కన్నులపండువగా ప్రారంభమైంది. తొలిరోజు కావడంతో స్థానిక పాదగయ పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలను వదిలారు. ఉమాకుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాలకు పాదగయ పుష్కరిణిలో నీటిని తీసుకువచ్చి స్వయంగా అభిషేకాలు చేశారు. స్థానిక పురుహూతిక అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

కార్తిక మాసం ప్రారంభం కావడంతో నియోజకవర్గంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెకువజాము నుంచే వందలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కార్తిక మాస పూజలు ప్రారంభం

- ఆలయాల్లో భక్తుల కిటకిట
- శివనామస్మరణతో మార్మోగిన పంచారామక్షేత్రం

సామర్లకోట: కార్తిక మాస పూజలు శనివారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమయ్యాయి. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామభీమేశ్వరస్వామి ఆలయం తెల్లవారు జామున నాలుగు గంటలకు తెరిచారు. ఆలయంలో గోపూజ, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవికి కుంకుమ పూజలు, ఆలయంలో ఉన్న ఉప ఆలయాలలోను ప్రత్యేక పూజలు చేశారు. శనివారం నుంచి డిసెంబరు 2 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివ, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. సాయంత్రం కార్తిక దీపాలు వెలగించారు. స్థానిక ఐదు తూముల వద్ద వేంచేసి యున్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ను, పాత సామర్లకోటలోని చంద్రశేఖర స్వామి ఆలయంలోను కార్తిక మాస పూజలు ప్రారంభమయ్యా యి. స్థానిక పంచారామ క్షేత్రంలో నవంబరు 15న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారి గ్రా మోత్సవం, రాత్రి జ్వాలా తోరణం ఉంటుంది. నవంబరు 19న తెప్పోత్సవం, 28న మాసశివరాత్రి పూజ లు, డిసెంబరు ఒకటిన కోటి దీపాలంకరణ, 2న పోలి పాడ్యమి సందర్భంగా స్వామి వారి జటాజుటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్తిక మాసంలో ఈనెల 4,11,18,24 తేదిలలోని సోమవారాలల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.





పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు